# మా లోకం!

'ఉలగం పలవిదం' అన్నాడు తమిళ హాస్యనట చక్రవర్తి ఎన్నెస్. కృష్ణన్. అంటే లోకంలో అనేక రకాల మనుషులుంటారూ – అని అర్థం. ఆ రకాల్లో ఒకరకంవుంది. ఆరకం మనుషులది ఉడుంపట్టు. వాళ్ళు పట్టింది అసలు కుందేలు కాదోయ్ పందిపిల్ల–అన్నా విడిచిపెట్టరు. అలాటి వాడె గన్నాబత్తుల మార్కండేయరావు.

బి. ఏ. తర్వాత ఎం. బి. ఏ. చదివి ఓ పెద్ద కంపెనీలో చిన్న ఆఫీసరుగా నెలకి పదకొండు వందలు తెచ్చుకుంటున్న మార్కండేయ రావుకు చిన్నప్పటినుండి కనపడ్డ పుస్తకాలు చదవడం అలవాటు. సగటు తెలుగు వాడిలా కాకుండా. చదవాలనుకున్న పుస్తకాలను, పత్రికలను కొనుక్కు– చదవడం మనవాడి మంచిగుణాలలో ఒక్కటి.

అలాటివాడి అభిరుచి ఉన్నవ. విశ్వనాథ నవలలనుండి బుచ్చిబాబు మీదుగా జారి, ఓడ్‌హౌసునందుకుని అగాథా క్రిస్టీనిదాటి బెర్నార్డ్ షాను పార్కిన్సన్‌ను అధిగమించి ప్రస్తుతం– మేనేజిమెంటు, సైకాలజీ. "మనస్సనే డైనమో" "మీ మెదడులో దాగిన శక్తులు" లాటి పుస్తకాలమీదకు మళ్ళింది.

ఒకనాడు ఆఫీసు లైబ్రరీలో ఒకానొక ఆంగ్ల వారపత్రిక చూస్తుండగా "అయితే– మీరు బాస్‌కాదలచుకున్నారన్నమాట! — అన్న పుస్తక ప్రకటన అతడిదృష్టి నాకర్షించింది. వెంటనే ఆ ప్రకటన నకలు రాసుకున్నాడు.

మరో రోజు ఆ పుస్తకం ధర ఇరవైమూడు రూపాయిలు. తపాలా ఖర్చులు రెండున్నర కలిపి మనియార్డరు పంపాడు. మనియార్డరు కూపన్ కింది భాగంలో తన అడ్రసు రాసి పుస్తకాన్ని పంపమని ప్రకటనలోవున్న "జడ్. ఏ. దారూవాలా అండ్ సన్స్, కస్తూర్బాగాంధీ మార్గ్. న్యూఢిల్లీ - 110001" అన్న చిరునామా వారికి రాశాడు.

— అక్కడితో ఆరంభమయింది శనిదశ ?

మూడువారాలయింది. పుస్తకం రాలేదు

దారూవాలా కంపెనీ తొంభైయేళ్ళనుండి నడుస్తూంది. చాల నమ్మకస్తులు గనుక పుస్తకం రాకుండా వుండడానికి వీలులేదు. కాని రాలేదు. రోజు రోజుకు ఆ పుస్తకం వెంటనే చదివేయాలన్న తహతహ హెచ్చుతోంది. కాని పుస్తకం కాదుకదా మనియార్డర్ రసీదు కూడా రాలేదు,

వెంటనే మార్చి 22 న- అనగా ఉగాదికింకో వారం వుందనగా— దారూవాలా కంపెనీ వాళ్ళకో వుత్తరం రాశాడు.

*　　　*　　　*

గ. మార్కండేయరావ్,
24-1-78 ఎర్రోజువీధి, సీతానగర్.
హైదరాబాద్.
22-3-77

అయ్యా !

తమ కంపెనీకి ఫిబ్రవరి 26 వ తేదీన "అయితే మీరు బాస్ కావాలనుకుంటున్నారన్నమాట." అన్న పుస్తకం పంపమంటూ రు. 25-50

మనియార్డర్ చేశాను. మూడువారాలు దాటినా పుస్తకం ఇంకారాలేదు. కనుక దయచేసి వెంటనే పుస్తకం పంపండి.

చిత్తగించవలెను.

భవదీయ
గ. మా. రావ్

♦ ♦ ♦ ♦

జడ్. ఏ. దారూవాలా అండ్ సన్స్.
బుక్ సెల్లర్సు
(స్థాపితము 1894)
192/11, 14 వ అంతస్థు
కస్తూర్బాగాంధీ మార్గ్,
న్యూఢిల్లి-110001.

26-3-77

డియర్ సార్,

మీ దృష్టిలో మా ప్రకటన పడడం మీరుమాకు పుస్తకం నిమిత్తం రాయడం చాల సంతోషం కలిగించింది. కాని మీరు వర్ణించినటువంటి మని యార్డర్ ఏదీ మాకు నేటివరకు రాలేదు. అది అందగానే తక్షణమే మీరు కోరిన పుస్తకం పంపగలవారము.

అయితే ఒక చిన్నమనవి.

మేము ప్రకటించిన పుస్తకంపేరు- "అయితే మీరు బాస్ కాదలచు కున్నారన్నమాట" దాని రచయిత- డబ్లియూ. ఏ. గ్రఫిల్. ప్రచురణ కర్తలు జాన్ డికిన్సన్స్. లండన్.

కాని మీరు రాసిన వుత్తరంలో "అయితే మీరు బాస్ కావాలనుకొంటు న్నారన్నమాట" అని రాశారు. ఆ పేరుగల ప్రచురణ ఏదీలేదు. అని గమ నించ ప్రార్థన."

సదా మీ సేవకు కాంక్షిస్తూ

భవదీయ

ఏ. డి. దారూవాలా

♦ ♦ ♦ ♦

30-3-77

హైదరాబాద్ పోస్టలు
సీనియర్ సూపరిండెంట్ వారికి.

అయ్యా!

నేను 28-3-77న సీతానగర్ పోస్టాఫీసునుండి "జడ్.ఎ. దారూవాలా అండ్ సన్స్, కస్తూర్బా గాంధీమార్గ్, న్యూఢిల్లీ" వారికి రు. 25-50 మని యార్డర్ కట్టాను. రసీదు నెంబర్ ఎ. 37491. ఆ మనియార్డర్ ఆ కంపె నీకి అందలేదు. మీరు ఈ విషయాన్ని పరిశోధించి. ఆ మనియార్డర్ ఏమయిందో తెలుపగలరా?

గ. మా. రా.

♦ ♦ ♦ ♦

11-4-77

"అయ్యా!

హై. పో. సీ. సూపరింటెండెంట్ గారూ,

రిఫరెన్స్ : నా ఫిర్యాదు తేది. 30-3-77

ఏమయింది? జవాబు ఇవ్వరేం?"

♦ ♦ ♦ ♦

13-4-77

'సార్!

మీ 11-4-77 వుత్తరం అందింది.

మీ 30-3-77 వుత్తరం మాకు అందలేదు.

ఎల్లప్పుడు మీ సేవయే మా పరమలక్ష్యం ''

ఇట్లు

సీ. సూ. హై. పో. డివిజన్''

♦ ♦ ♦ ♦

హైదరాబాద్

15-4-77

"డియర్ హై. పో. సీ. సూ. గారు

ఇంకానయం, ఆ మనియార్డర్ నకలు అడిగారుకాదు!

ఇదిగో ఇందుతోబాటు నా 30-3-77 వుత్తరం నకలు పంపుతున్నాను.

అర్జెంటుగా మనియార్డర్ ఏమయిందీ చెబుతారూ?

గ. మా. రా.''

♦ ♦ ♦ ♦ ♦

హైదరాబాద్

13-4-77

''సార్!

మీ 15/4 వుత్తరం ఎన్‌క్లోజర్‌తోసహా అందింది. సీతానగర్ సబ్ ఆఫీసు సికింద్రాబాద్ డివిజన్‌లో వున్నది. కనుక మీ ఫిర్యాదును ఆ పోస్టలు

డివిజన్ సీనియర్ సూపరింటెండెంటుగారికి పంపడమైనది. ఇకపై ఈ ఫిర్యాదు విషయమై వారికే రాయుదురు గాక!

ఎల్లప్పుడు మీ సేవయే మా పరమ లక్ష్యం.

ఇట్లు
అసిస్టెంట్ సీ. సూ. హై పో. డి.''

న్యూఢిల్లీ
13-4-77

"అయ్యా!

ఆ మధ్య మీరు మా కంపెనీ పుస్తకాలపట్ల అభిరుచి వున్నట్లు తెలియజేసిన మూలంగా మిమ్మల్ని మా "మేనేజ్‌మెంట్ లిటరేచర్'' మెయిలింగ్ లిస్ట్‌లో చేర్చామని తెలుపడానికి సంతోషిస్తున్నాము. ఇటీవలే 'డబుల్ డే' కంపెనీ వారి అతి నూతన ప్రచురణ ఒకటి- "మేనేజిమెంట్‌కు మధురమయిన మెట్లు'' అన్నది తప్పక మీవంటి ఎగ్జిక్యూటివ్‌ల వద్ద వుండి తీరాలి అని మా కాంక్ష. అంచేత ఇండియాకు వచ్చిన పదే పది కాపీలలో ఒకటి మీకు కేటాయించి వి.పి.పి.లో పంపిస్తున్నాము. అసలు ధర రు. 67-50కాగా ప్రత్యేక తగ్గింపు ధర రు. 50 విపిపి చార్జీలు కలిపి, 55 చెల్లించి పుస్తకం తీసుకోగలరు.

"మంచి పుస్తకాలను మించిన కాలక్షేపం లేదు."

మీ సేవనే కాంక్షిస్తూ మీ

ఏ. డి దారూవాలా''

సికిందరాబాద్
27-4-77

"ఆర్యా,

తేది 30-3-77 ఫిర్యాదు అందినదని తెలుపుతున్నాము. విషయం పరిశీలనలో వుంది.

త్వరలో మా నుండి వుత్తరం రాగలదు.

ఎల్లప్పుడు మీ సేవయే మా పరమలక్ష్యం.

భవదీయ
సీ. సూ. పో. సికిందరాబాద్ డివిజన్

♦ ♦ ♦

హైదరాబాద్
21-4-77

"అయ్యలారా! దారూవాలా అండ్ సన్సూ

"మేనేజి మెంటుకు మధురమైన మెట్లు"- పదో వందో వున్నాయి. కనుక ప్రస్తుతానికి నన్నొదిలి పెట్టండి.

ఇట్లు
గ. మా. రా"

♦ ♦ ♦

సికిందరాబాద్
6-5-77

"శ్రీ మార్కా బత్తుల గన్నేశ్వరరావ్ గారికి

ఆర్యా,

మీ 30/3/77 ఫిర్యాదు మీద మా 27-4-77 లేఖ తర్వాత తెలియ జేయడ మేమనగా ఫిర్యాదు ఢిల్లీ హెచ్.పి.ఓ. పోస్ట్‌మాస్టర్‌కు తెలియ జేయడ మైనది. గమనింతురుగాక!

ఎల్లప్పుడు మీ సేవయే మా పరమలక్ష్యం.

ఇట్లు
సీ. నూ. వో. సి. డి.
(కాపీ.టు. హెచ్.పి.ఓ న్యూఢిల్లీ)

♦ ♦ ♦ ♦

మద్రాసు-12
11-5-77

మా వద్ద సకల విధములయిన పురాణ గ్రంథములు, పురాణేతర గ్రంథములు. రకరకాలయిన సాహిత్య వృక్షములు, మొక్కలు నారు మొక్కలు దొరుకును.

మీరు పుస్తక పిపాసి అని మాఢిల్లీ ప్రతినిధి తెలుపగా మీకు మా తాజా గ్రంథాల పట్టిక పంపినాము.

పాతిక రూపాయల పైన విలువగల పుస్తకాలకు ఆర్డరు పంపితే పోస్టేజి మేమే పెట్టుకుంటాము.

అమూల్యమయిన మీ ఆర్డర్ కోసం ఎదురుచూస్తున్నాము.

ఉమాకాంతం జనార్దనరావ్
పార్టనర్, శ్రీ లతా పబ్లిషర్స్"

హైదరాబాద్
8-5-77

సీ. సూ. పో. సి. డి గారూ!

"ఏవిటండీ ఈ అన్యాయం!

ఓసారి నా నెం. 30-3-77 ఉత్తరం చూడండి అందులో నా పేరు గమనించండి.

మీ 27-4-77 వుత్తరంలో మీరే నా పేరు సరిగా రాశారు. అది చదవండి.

మరి మీ 6-5-77 వుత్తరంలో కవర్ మీద "గన్నా బత్తుల మార్కండేయరావు" అని చక్కగారాసి లోపల వుత్తరంలో మార్కా బత్తుల గన్నేశ్వరావ్" అని రాస్తారా? ఇంకా వుంటే 'కత్తుల రత్తయ్య' అని రాసేట్టున్నారు.

ఏం అంత అజాగ్రత్తా లేక వేళాకోళమా?

గ.మా.రా"

♦ ♦ ♦ ♦

న్యూఢిల్లీ
28-4-77

"సార్!

మీరు "మేనేజ్‌మెంట్‌కు మధురమైనమెట్లు" పుస్తకం పది ప్రతులు కావాలని రాశారు. చాలా సంతోషం. అయితే ఇదివరకే మీకు ఒకప్రతి వి. పి. పి. ద్వారా పంపాము. అదీ పాటికి విడిపించుకుని వుంటారను కుంటాము. మిగిలిన తొమ్మిది ప్రతులనూ ఇవ్వాళే వి. పి. పి. ద్వారా పంపాము. రు. 597 కట్టి వి. పి. పి. విడిపించుకో గలరని మా ఆశ.

మీ వంటి పుస్తక ప్రేమికులు ఈ దేశంలో అరుదంటే నమ్మండి.

మీ

బి. డి. దారూవాలా"

నయిదిల్లీ
25-5-77

మహోదయ్.

హామే....

సదా ఆప్‌కో సేవామే!

భవదీయ

న....మం....న్

♦ ♦ ♦ ♦

సికిందరాబాద్
28-5-77

"శ్రీ కత్తులరత్తయ్యగారికి.

మీ 8-5-77 పుత్తరం అందింది.

ఆఫీసులో జరిగిన పొరపాటువలన మీ పేరును 'మార్కా బత్తుల గన్నేశ్వరావ్'అని రాయడం జరిగింది. ఇక ముందెప్పుడూ మీ పేరును సరిగా "కత్తుల రత్తయ్య" అనే రాయగలవారము. ఎల్లప్పుడూ మీ సేవయే మా పరమ లక్ష్యం."

ఇట్లు
సీ. పూ. పో. సిడి.

♦ ♦ ♦

హైదరాబాద్ జి. పి. ఓ.
28-5-77

ఆర్యా!

మీ పేరిట ఒక రు 27-50 మనియార్డర్ ఢిల్లీనుండి వచ్చివున్నది. మీరు ఫలానా ఆ మీరే అన్న ధృవీకరణ పత్రంతో ఏ నాడయినను ఈ

క్రింది అధికారి ఎదుట హాజరయి, అతనికి వాస్తవములను తెలిపి మని యార్డర్ సొమ్మును పొందండి.

ఎల్లప్పుడు మీ సేవయే మా పరమలక్ష్యం

పో.మా."

♦ ♦ ♦

మద్రాసు 12
5-7-67

"సాహితీప్రియా!

మీరు మా సోదరసంస్థ అయిన దారూవాలా (ఢిల్లీ) వారినుండి ఒకే పుస్తకం తాలూకు పది ప్రతులు తెప్పించినట్లు తెలుసుకున్నాము- మీ పుస్తకాల పిపాస అపూర్వమైనది.

"మేనేజి మెంటు" వంటి అధునాతన రంగంలో ఆసక్తి వుండే మీకు తప్పకుండా ప్రాచీన భారతసాహిత్యం అంటే మమకారం వుండి తీరుతుంది అని మా నమ్మకం. ఆ నమ్మకంమేరకు మీకు గత సంవత్సరపు బెస్ట్ సెల్లర్స్ అయిన

"రాముడు రాముడు కాదు।"

"రాముడు రాముడే!"

"ఆనాటి రామావతారమే ఈనాటి 'మో' తారమా?"

అన్న టైటిల్సును వి.పి.పి. ద్వారా పంపినాము. రు. 112 కట్టి వాటిని విడిపించి ఆంధ్రదేశంలో అన్వేషణా. రంధ్రాన్వేషణా సాహిత్యా లని పోషించగలరని మా హృదయపూర్వక విశ్వాసం.

ఇట్లు

ఉ॥ జనార్ధనరావ్

పార్ట్నర్ శ్రీ లతా పబ్లిషర్స్

♦ ♦ ♦

సికిందరాబాద్
9-6-77

కత్తుల రత్తయ్యగారూ!

(ఎ) మీరు ఈ దిగువ నుదహరింపబడిన అధికారి పేర ఒక రు 597ల పుస్తకాల పార్సిలు పంపియున్నారు. మీ ఉద్దేశం ఈ దిగువ ఉ॥ న అధికారికి అవగతం కావడం లేదని మనవి. అంచేత దానిని మీకే తిప్పి పంపుతున్నాము.

(బి) మా ఫైలులోని పాత కరెస్పాన్‌డెన్స్‌లో మీ పేరు కత్తుల రత్తయ్య అని వుండగా మీరు పంపిన ఈ పుస్తకాల పార్శిల్ మీద గన్నా బత్తుల మార్కండేయరావు అని రాశారు? మీరు పేరు ఎప్పుడు మార్చుకున్నారు? హఠాత్తుగా పేరు మార్చుకుంటే పాత రిఫరెన్సులు వెతకడం కష్టమవుతుంది. ఇంతకూ మీరు పేరు మార్చుకుంటున్నట్లు వేసిన గెజెట్ ప్రకటన నొకటి పంపగలరా?

ఎల్లప్పుడూ మీ సేవయే మా పరమలక్ష్యం.

మీ
సీ. సూ. పో. సి. డి"

♦ ♦ ♦

న్యూఢిల్లీ
14-6-77

"డియర్ శ్రీ లతా పబ్లిషర్స్!

మీరు గన్నాబత్తుల వెంకటేశ్వరరావ్ కేరాఫ్ దారువాలా అండ్ సన్స్ అని పంపిన పార్శిలు చూచాము. కాని ఆ పేరుగల వ్యక్తి ఈ కంపెనీలో

పనిచేయలేదు. చేయుచుండుటలేదు. ఈ మదరాసీపేరు మనిషి ఇంకేదయినా కంపెనీలో వున్నాడేమో కనుక్కోండి.

పార్సిలు వెనక్కు పంపిస్తున్నాము. భవదీయ

బి. డి. దారూవాలా"

◆ ◆ ◆

హఠాత్తుగా జూలై ఒకటవ తారీకునాడు అన్ని తెలుగు దినపత్రికల లోనూ ఒక ప్రకటన కనపడింది చదివినవారి కెవరికీ అర్థంకాలేదు. అర్థంకాని ఆ ప్రకటనఇలా వుంది.

గమనిక

నేను అనగాలేటు శ్రీగన్నాబత్తుల పెదకామేశ్వరరావుగారి రెండవ కుమారుడను. హైదరాబాద్‌లోని సీతానగర్‌లోని ఎర్రోజు వీధిలోని డోర్ నేంబర్ 24-1-78 గల ఇంటికాపురస్తుడను. మేజర్‌ను అయిన గన్నా బత్తుల మార్కండేయరావు (ఉరఫ్ మార్కాబత్తుల గన్నేశ్వర్రావ్ ఉరఫ్ కత్తుల రత్తయ్య).

ఇందుమూలమున

సకలపుస్తక విక్రేతలకు, పంపిణీదారులకు, టోకు మరియు చిల్లర వర్తకులకు, తంతి తపాలశాఖ సూపరింటెండెంట్లకు, పోస్టుమాస్టర్లకు. ఇన్‌స్పెక్టర్లకు తదితర అశేష భారత జనావళికి.

తెలియ జేయడం ఏమనగా.

నాకు పుస్తకాలు చదవడం అంటే రోత.

పుస్తకాలు కొనడం అంటే కోపం.

ఎవరో నా జ్ఞాతులు. మా ఆఫీసులో కొందరు ఎక్స్‌పార్టీవారు నా పేరిట పుస్తకాలకు ఆర్డర్లిస్తున్నారు; నన్ను అపఖ్యాతి పాలు చేయాలని చూస్తున్నారు. ఇది చట్టవిరుద్ధం. ఆటువంటి బోగసు ఆర్డర్లను నమ్మి పుస్తకాల విక్రేతలు పుస్తకాలు పంపితే అందుకు పూర్తిగా వారే బాధ్యులు.

నన్ను ఇట్టి అల్లరిపాలు చేస్తున్న దుర్మార్గులు పట్టుబడితే వారిపై నా లాయరుగారి ద్వారా క్రిమినల్ చర్యలు తీసుకొంటానని హెచ్చరిస్తున్నాను.

ఇదే ప్రకటన హిందీలో ఢిల్లీ దినపత్రికలో అచ్చయిందని తెలుగు మహాజనానికి తెలీదుమరి! *

కథా నిలయం
3913
శ్రీకాకుళం